క్లుప్తంగా

గోవులకు టీకాలు



గోవుకు టీకా వేస్తున్న వెటర్నరీ డాక్టర్లు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న గోసంరక్షణశాలలో దేవస్థాన ఈఓ ఆదేశాల మేరకు గోవులకు ఆదివారం టీకాలు వేశారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులను బట్టి సాధారణంగా గోవులకు వచ్చే సీజనల్ వ్యాధులైన గోంతువాపు వ్యాధి, జబ్బువాపు వ్యాధులు రాకుండా ఉండేందుకుగాను 800పైగా గోవులు, పెయ్యదూడలు, కోడెదూడలకు హెచ్.ఎస్.బి.క్యూ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో గోశాల పర్యవేక్షకులు బి.శ్రీనివాసులు, గుమస్తా బి.హనుమంతు, వెటర్నరీ అసిస్టెంట్లు జయరాముడు, నాగన్న, మనిషా తదితర సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలల నిర్వహణ

కొత్తపల్లి: ప్రభుత్వ పాఠశాలలు సోమవారం నుంచి రెండుపూటల నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ శ్రీరాములు ఆదివారం తెలిపారు. రాష్ట్రప్రభుత్వం వేసవి ఎండలు, వడగాల్పుల వలన విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శనివారం వరకు ఒంటిపూట బడులు పెట్టిందని తెలపారు. ఇవి పూర్తికావడంతో నేటి నుంచి ప్రాథమిక పాఠశాలలు 9 నుంచి 3.30 గంటలవరకు, ప్రాథమికోన్నత, జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు 9 నుంచి 4 గంటల వరకు తరగతులు ఉంటాయని పేర్కొన్నారు.

1 నుంచి జగనన్న సురక్ష గ్రామసభలు

పాములపాడు: జూలై 1 నుంచి మండలంలో జగనన్న సురక్ష గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోపీకృష్ణ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. 1న మద్దూరు, 4న పాములపాడు-1, 6న భానుముక్కల, 11న మిట్టకందాల, 13న కొత్త బానకచెర్ల, 15న పాములపాడు-2, 18న ఇస్కాల, 20న చెలిమిల్ల, 22న జూటూరు-2, 25న వేంపెంట, జూటూరు-1, 27న యర్రగూడూరు, 27న వానాల గ్రామాల్లో సభలు ఉంటాయన్నారు. తహసీల్దార్, ఈఓపీఆర్డీ, మండల సర్వేయర్ ఒక బృందంగా, ఎంపీడీఓ డిప్యూటీ తహసీల్దార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లతో కూడిన మరో బృందంగా ఏర్పడి ఈ గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



ర్యాలీ నిర్వహిస్తున్న హౌసింగ్ అధికారులు

ఆత్మకూరు: జగనన్న కాలనీలోని పక్కా గృహాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ ఉమామహేశ్వరరావు, కమిషనర్ శ్రీనివాసరావులు అన్నారు. పట్టణంలోని జగనన్న కాలనీలను ఆదివారం లబ్ధిదారులతో ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ఇంటి స్థలాలు పొందిన లబ్ధిదారులు గృహ నిర్మాణాలను ఆలస్యం చేయవద్దన్నారు. లబ్ధిదారులందరికీ బిల్లులు వెంటనే మంజూరు చేస్తామని, ప్రధాన మంత్రి పీఎం ఆవాస పథకం కింద జగనన్న గృహాల కింద బిల్లులు మంజూరు చేస్తున్నామని చెప్పారు. ప్రతి లబ్ధిదారుడు ఇళ్లను కట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఈఈ ఉమామహేశ్వరరెడ్డి, లబ్ధిదారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు స్వల్పగాయాలు

మహానంది: గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ జనార్ధన్‌శెట్టి బురదలో కాలుజారి కిందపడడంతో స్వల్పగాయాలయ్యాయి. బసవాపురం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన టిఫిన్ చేసి చేతులు శుభ్రం చేసే సమయంలో బురద ఉండటంతో జారి కిందపడ్డాడు. దీంతో కాలిబొటనవేలికి గాయమై రక్తస్రావమైంది. స్థానిక ఆర్ఎంపీ రఫీ వైద్యసేవలు అందించారు.

తూడిచెర్ల రోడ్డు నిర్మించాలి



సంతకాల సేకరణ చేపట్టిన నాయకులు

జూపాడుబంగ్లా: పారుమంచాల నుంచి తూడిచెర్లకు వెళ్లే దారిని నిర్మించాలని సీపీఐ నాయకులు ఆదివారం తూడిచెర్ల గ్రామంలో సంతకాల సేకరణ చేపట్టారు. సీపీఐ నాయకుడు రమేష్‌బాబు మాట్లాడుతూ పారుమంచాల నుంచి తూడిచెర్లకు ఏడు కిలోమీటర్ల మేర ఉన్న రోడ్డు పంచాయతీరాజ్‌శాఖ అధ్వర్యంలో ఉందన్నారు. ఈ రోడ్డు అడుగడుగునా గుంతలమయంగా మారగా ఏడాది క్రితం మరమ్మతుల నిమిత్తం రూ.5లక్షల జెడ్పీ నిధులను మంజూరు చేశారని చెప్పారు. ఆ తరువాత రోడ్డును ఆర్‌అండ్‌బీకి మార్చాలని తూడిచెర్ల గ్రామపంచాయతీ, జిల్లా పరిషత్ తీర్మానాలను ఆ శాఖ అధికారులకు పంపించారన్నారు. అయినా నేటికీ రోడ్డు ఆర్‌అండ్‌బీలోకి కన్వర్టు చేయకపోవటంతో నిధులు మంజూరు కాక రోడ్డు ఛిద్రమైందని తెలిపారు. ఏఐఎస్‌ఎఫ్ నాయకుడు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పగలే కరెంటు.. తప్పిన కష్టాలు

- వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూటే నాణ్యమైన విద్యుత్
- తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా కరెంట్ సరఫరా
- నియోజకవర్గ వ్యాప్తంగా 13,599 కనెక్షన్లు
- అన్నదాతకు తప్పిన కష్టాలు

మండలం	వ్యవసాయ కనెక్షన్లు
నందికొట్కూరు	1,899
జూపాడుబంగ్లా	3,035
మిడుతూరు	3,108
పగిడ్యాల	1,277
కొత్తపల్లి	1,780
పాములపాడు	2,500



పగటి పూట పంటకు నీరు పెడుతున్న రైతు

నందికొట్కూరు: వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ పంపుసెట్లకు పగటిపూట నాలుగేళ్ల పాలనలో నిరంతరాయంగా తొమ్మిది గంటల పాటు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుండడంతో అన్నదాత ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి మాట నిలబెట్టుకున్నారని ప్రశంసిస్తున్నారు.

గతంలో రాత్రి వేళ నాణ్యతలేని విద్యుత్..

టీడీపీ ప్రభుత్వం హయంలో రైతులు విద్యుత్ కోసం అనేక అవస్థలు ఎదుర్కొనేవారు. వ్యవసాయానికి అర్ధరాత్రి 12 గంటల తరువాత నాణ్యతలేని ఉచిత విద్యుత్‌ను సరఫరా చేసేవారు. దీంతో రైతులు అనేక ఇక్కట్లకు గురయ్యేవారు. అర్ధరాత్రి వేళ పొలాల్లోకి వెళ్లేటప్పుడు విషపురుగులు, విద్యుత్ షాక్ బారిన పడి ప్రాణాలు కోల్పవడం, గాయపడడం వంటి సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి లేకుండా పగటి వేళలోనే నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా సరఫరా చేస్తుండడంతో రైతులకు కష్టాలు తప్పాయి. నాలుగేళ్ల నుంచి పగటి పూట 9 గంటల పాటు ఉచిత విద్యుత్ ఇవ్వడంతో ఎలాంటి భయం లేకుండా పంటలకు సాగునీటిని పెడుతున్నామంటున్నారు. ప్రస్తుతం నియోజకవర్గ వ్యాప్తంగా 13, 99 మంది రైతన్నలకు ఉచితంగా విద్యుత్ ప్రభుత్వం అందిస్తుంది.

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగనన్న



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన తొమ్మిది గంటల ఉచిత విద్యుత్ సరఫరా హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలబెట్టుకున్నారు. పగటి పూట నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో ప్రాణ నష్టం లేదు. సీఎం వైఎస్ జగనన్న రుణం తీర్చుకోలేం.

– జయరాం, కొక్కెరంచ, కొత్తపల్లి మండలం

పగటి పూట కరెంట్ ఆనందంగా ఉంది



గత తెలుగు దేశం పాలనలో అర్ధరాత్రి సమయంలో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ సరఫరా చేసేవారు. దీంతో పొలాలకు వెళ్లేందుకు ఇబ్బంది పడేవాళం. మూడేళ్ల జగనన్న పాలనలో పగటి పూట తొమ్మిది గంటలు ఉచిత విద్యుత్ నిరంతరాయం సరఫరా చేయడం ఆనందంగా ఉంది. సీఎం వైఎస్ జగనన్నకు రైతన్నలందరూ రుణపడి ఉంటారు. – శ్రీనివాసులు, పాములపాడు

గతంలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు



గత తెలుగు దేశం పాలనలో రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. వ్యవసాయ పంపుసెట్లకు అర్ధరాత్రి వేళ్లలో విషపురుగుల బారిన పడి ప్రాణాలు వదిలిన రైతులు ఎందరో. చాలా మంది నిద్రకు దూరమైన అనారోగ్యానికి గురయ్యేవారు. మూడేళ్ల జగనన్న పాలనలో అలాంటి కష్టాలు రైతులకు రాలేదు.

– విల్సన్, దామగట్ల, నందికొట్కూరు మండలం

నాణ్యమైన విద్యుత్ నిరంతరాయంగా సరఫరా

ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను పగటిపూటే నిరంతరాయంగా సరఫరా చేస్తున్నాం. సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం 13, 599 మంది రైతన్నలకు 9 గంటలు పగటి పూటనే ఉచిత విద్యుత్ రైతన్నలకు అందిస్తున్నాం. నియోజకవర్గ వ్యాప్తంగా వ్యవసాయ ఉచిత విద్యుత్ కనెక్షన్లు దరఖాస్తు చేసుకున్న నెలలోపు మంజూరు చేస్తాం.

– శ్రీనివాసులు విద్యుత్ డీఈ

హాస్టల్ సీటుకు దరఖాస్తు చేసుకోండి

జూపాడుబంగ్లా: స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్‌లో ప్రవేశానికి విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ఉమాదేవి కోరారు. ఆధార్‌కార్డు, తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, బ్యాంకు (వ్యక్తిగతం లేక తల్లిది)పుస్తకం జిరాక్సు కాపీలతో పాటు విద్యార్థిని ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్(టీసీ), కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, 3 పాసుఫోటోలను జతపరచాలని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు అధిక ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ నెలాఖరులోగా జూపాడుబంగ్లా హాస్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ ఉమాదేవి తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్: 7780357293 కి ఫోన్‌చేయవచ్చునన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సాధారణం

ఆత్మకూరు: క్రీడల్లో గెలుపు ఓటములు సాధారణమని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు మోమిన్ షబానా అన్నారు. మండలంలోని బాపనంతపురం గ్రామంలో సోమవారం బక్రీద్ పర్వదినం సందర్భంగా రాష్ట్రస్థాయి క్రికెట్‌పోటీలను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. పోటీల్లో మొదటి బహుమతి రూ.20116ను దాత షేక్ జాకీర్‌హుసేన్, రెండవ బహుమతి రూ.10116 షేక్ అమానుల్లా, మూడవ బహుమతి రూ.5116 సతీష్ బాబులు అందజేయడం సంతోషకరమన్నారు. దాతలు క్రీడలను ప్రోత్సహించాలన్నారు. ఐదు రోజుల పాటు క్రీడా పోటీలు జరుగుతాయని చెప్పారు. ఎన్ని జట్లు వచ్చినా అవకాశం కల్పిస్తామన్నారు. క్రీడా కావాల్సిన అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు.

జగనన్న పాలనలో ప్రతి పేదకుటుంబానికీ లబ్ధి

- అర్హులందరికీ పథకాలు అందించేందుకే 'జగనన్న సురక్ష'
- గ్రామాల్లో సమస్యల పరిష్కారానికే 'గడప గడపకు మన ప్రభుత్వం'
- శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



ఆంజనేయపురంలో ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: సీఎం వైఎస్ జగనన్న పాలనలో ప్రతి పేదకుటుంబానికి లబ్ధి చేకూరిందని, సంక్షేమ పాలన అందిస్తూ పేదల గుండెల్లో నిలిచిపోయారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. గాజులపల్లె మజరా గ్రామాలైన బసవాపురం, అంజనేయకొట్టాల, బుచ్చమ్మతోట, బోయిలకుంట్ల మెట్ట గ్రామాల్లో ఆదివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఒకేరోజు నాలుగు గ్రామాల్లోని గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి, ఓపిగ్గా ప్రజా సమస్యలు వింటూ ముందుకు సాగారు. అవ్వా...ఈ పథకాలన్నీ ఎవరిచ్చారు, అక్కా...పింఛను ఇంటికే వస్తుందా, అమ్మా...పిల్లలకు అమ్మ ఒడి వచ్చింది అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ.. మళ్లీ జగనన్ననే సీఎం చేసుకుందాం అంటూ సమస్యలు అడిగితెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటి వరకు రాష్ట్రంలో ఇచ్చిన హామీల ప్రకారం 96 శాతం పైగా నెరవేర్చారని, అర్హులై ఉండి పథకం రానివారు ఉంటే వారికి న్యాయం చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. గ్రామాల్లో అర్హులెవరూ మిగిలిపోవద్దన్న కాంక్షతో చేస్తున్న కార్యక్రమాన్ని అధికారులు, సచివాలయ సిబ్బంది నిబద్ధతతో చేసి పేదలకు అండగా నిలబడాలని సూచించారు.

సమస్యల పరిష్కారానికి ఆదేశం..

గ్రామాల్లో ప్రజల సమస్యల పరిష్కారం కోసమే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమమని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆంజనేయకొట్టాలలో ప్రస్తుతం ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోలేదని, నూతన ట్రాన్స్‌ఫార్మర్ వేయాలని ప్రజలు కోరగా సమస్యలను పరిష్కరించాలని ఏఈ ప్రభాకర్‌రెడ్డితో మాట్లాడారు. పేదలకు ఇచ్చిన స్థలాల లేఅవుట్‌ను పరిశీలించి ఎవరి ప్లాట్ వారికి చూపి త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు చేపట్టాలని సర్వేయర్, హౌసింగ్ అధికారులను ఆదేశించారు. బోయిలకుంట్ల మెట్ట వద్ద శ్మశానానికి దారి విషయం పరిష్కరించాలని రెవెన్యూ అధికారులతో పాటు ఎస్ఐ నాగేంద్రప్రసాద్‌కు సూచించారు. మళ్లీ నాకు వాటి స్థితిగతులపై ఫొటోలో పంపించాలన్నారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, గోపవరం సొసైటీ చైర్మన్ వడుగూరి రామకృష్ణుడు(గాజులపల్లె కిట్టు), జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ కొమ్మా పాలమహేశ్వరరెడ్డి, ముఖ్యనేతలు కొండా మధుసూదన్‌రెడ్డి, గాజులపల్లె సర్పంచ్ గద్దం చంటి, ఎంపీటీసీ చౌటుపల్లి నరసింహుడు, మదాసి కురువ రిజర్వేషన్ పోరాటసమితి కన్వీనర్ గజ్జ పెద్దపక్కీరయ్య, ఎస్సీ సెల్ కన్వీనర్ కోలా శ్రీనివాసులు, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జున, వ్యవసాయ సలహామండలి చైర్మన్ శరభారెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటరమణ, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈరోజు

ఎమ్మెల్యే శిల్పా రాక

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సోమవారం వెలుగోడు పట్టణంలో పర్యటించనున్నారు. స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ఉదయం 9 గంటలకు మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించనున్నారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తెలిపారు. అనంతరం వెలుగోడు సొసైటీ వద్ద నూతన భవనాలకు ఎమ్మెల్యే భూమిపూజ చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ నాయకుడు శిల్పా భువనేశ్వర్‌రెడ్డి కూడా హాజరవుతున్నట్లు చెప్పారు. పార్టీ శ్రేణులు, ప్రజా ప్రతినిధులు ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

మార్కెట్‌యార్డు చైర్మన్ ప్రమాణస్వీకారం

ఆత్మకూరు: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం మార్కెట్‌యార్డు చైర్మన్‌గా బాలస్వామి యాదవ్ ప్రమాణస్వీకారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు సయ్యద్ మీర్, రాజమోహన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి హాజరవుతారని చెప్పారు. కార్యక్రమానికి విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, హాజరు కావాలన్నారు.

స్పందన కార్యక్రమం

నందిఒకట్కూరు: పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తునట్లు తహసీల్దార్ రాజశేఖర్‌బాబు ఆదివారం తెలిపారు. ఉదయం 10. 30 గంటలకు స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ఎలాంటి సమస్యలున్నా అర్జీలు ఇవ్వాలని చెప్పారు. ఈ అవకాశాన్ని మండల, పట్టణ ప్రజలు ఉపయోగించుకోవాలని కోరారు.

'గడప గడపకు మన ప్రభుత్వం'

మిడుతూరు: మండలంలోని నాగలూటి గ్రామ సచివాలయ పరిధిలోని పైపాలం గ్రామంలో సోమవారం సాయంత్రం 3 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ హాజరై ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ లబ్ధిని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, మండల స్థాయిలో విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారిఫ్ హాజరవుతారని, ఈ సమావేశం మధ్యాహ్నం 3గంటలకు ప్రారంభమవుతుందని చెప్పారు. సమావేశానికి అన్ని వార్డుల కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు హాజరు కావాలని కోరారు.

రేపు నందికొట్కూరులో..

నందికొట్కూరు: ఈ నెల 27వ తేదీన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తునట్లు మున్సిపల్ కమిషనర్ కిషోర్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖ అధికారులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

ఆధ్యాత్మికం

అమ్మవారికి పల్లకీ సేవ



స్వామిఅమ్మవార్లకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. పూజా కార్యక్రమాల్లో ఈఓ ఎస్ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్నసేవలో సినీ దర్శకుడు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఆదివారం సినీ డైరెక్టర్ రవిచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. నల్లమల సినిమాతో కెరియర్ ప్రారంభించి, ప్రస్తుతం నవాబ్ సినిమా షూటింగ్ దశలో ఉంది. నవాబ్ సినిమా త్వరలో ప్రేక్షకులకు ముందుకు రానున్న నేపథ్యంలో శ్రీమల్లికార్జున స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నట్లు రవిచరణ్ తెలిపారు.



మల్లన్నను దర్శించుకున్న అనంతరం ఆలయం వెలుపల సినీ డైరెక్టర్ రవిచరణ్

గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించాలి



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ

మహానంది: నంద్యాల పట్టణంలోని ప్రైవేటు వైద్యులు గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలో ఆదివారం ఇండస్ హార్ట్ ఇన్‌స్టిట్యూట్, హర్సెల్ఫ్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చిన్నచిన్న అనారోగ్యాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఇంటి ఆదినారాయణ, డాక్టర్ హిందుమతి, డాక్టర్ భార్గవవర్ధన్‌రెడ్డి, డాక్టర్ జహంగీర్, డాక్టర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కంటిజబ్బులపై అప్రమత్తంగా ఉండండి

జూపాడుబంగ్లా: కంటిజబ్బుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆప్తాల్మిక్ డాక్టర్ అమీఖాన్ అన్నారు. ఆదివారం జూపాడుబంగ్లా గ్రామసచివాలయంలో ఉచితంగా కంటి పరీక్షల శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మానవుని శరీర అవయవాల్లో కళ్లు ప్రత్యేకమైనవన్నారు. సున్నితమైన కళ్లను జాగ్రత్తగా కాపాడుకోవాలని సూచించారు. అనంతరం 60మందికి ఉచితంగా పరీక్షలు నిర్వహించి వారిలో శస్త్ర చికిత్సలు అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రెఫర్ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ మొట్టె బాలస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు జంగాలపెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంతంపై విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి సభ్యులు

ఆత్మకూరు: మండలంలోని వెంకటాపురం, కృష్ణాపురం గ్రామంలో ఆదివారం త్రైత సిద్ధాంతంపై విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి ఆత్మకూరు కమిటీ అధ్యక్షుడు రామచంద్రుడు, మునిస్వామి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సత్యం, జ్ఞానం కలిగి ఉండాలని, ఆధ్యాత్మిక ద్వారా మంచి మార్గంలో పయనించవచ్చని చెప్పారు. చెడు సావాలకు బానిసలు కావద్దని, భగవద్గీత ద్వారా ప్రతి ఒక్కరు జ్ఞానాన్ని పొందవచ్చని చెప్పారు. శ్రీకృష్ణ భగవానుడి జగద్గురుగా భావించి పూజలు చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి కమిటీ సభ్యులు పార్థసారథి, చక్రపాణి, వెంకటేశ్వర్లు, పుల్లారెడ్డి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



మహానంది: బండిఆత్మకూరు తహసీల్దార్ కార్యాలయం సమీపంలో విద్యుత్ స్తంభం ఒరిగి ప్రమాదకరంగా మారింది. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ తదితర కార్యాలయాలు ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది. దీంతో విద్యుత్‌శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

బండిఆత్మకూరు తహసీల్దార్‌గా రవికుమార్

మహానంది: బండిఆత్మకూరు తహసీల్దార్‌గా రవికుమార్‌ను నియమిస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. బండిఆత్మకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఉమారాణిని ఆత్మకూరు తహసీల్దార్‌గా బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో కలెక్టర్ కార్యాలయంలోని డీ సెక్షన్‌లో తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్ నియమించారు. ఈ మేరకు ఆయన త్వరలో బాధ్యతలు తీసుకోనున్నట్లు కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ముమ్మరంగా మొక్కజొన్న సాగు



తంగడంచ వద్ద మొక్కజొన్న విత్తుతున్న కూలీలు

జూపాడుబంగ్లా: వాతావరణం చల్లబడటంతో మండలంలోని తంగడంచ, మండ్లెం, తర్తూరు, తరిగోపుల, పారుమంచాల, తూడిచెర్ల తదితర గ్రామాల్లోని బోర్లు, బావులున్న రైతులు ముమ్మరంగా మొక్కజొన్న విత్తనాలు విత్తుకుంటున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ మొక్కజొన్న పంట సాధారణ సాగు విస్తీర్ణం 12.560ఎకరాలు కాగా ఇప్పటికే సుమారు 2,500ఎకరాలు పైబడి బోర్లు, బావుల కింద పంట వేశారని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. జూన్ మాసంలో ఆశించిన వర్షాలు కురవకపోయినప్పటికీ బోర్లలో భూగర్భజలాలు తగ్గకపోవటంతో రైతులు ఖరీఫ్ పంటలను సాగుచేసుకొంటున్నారు.

వర్షించిన మేఘం



కొత్తపల్లి మండలం నందికుంట గ్రామసమీపంలోని పొలంలో నిలిచిన వర్షపు నీరు



మహానంది సమీపంలో కమ్ముకున్న మేఘాలు



పాములపాడులో వర్షపు నీటిలో కూరగాయాలు

- నందికొట్కూరు, శ్రీశైలం నియోజకవర్గాల్లో పలు చోట్ల వర్షాలు
- చల్లబడిన వాతావరణం
- హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

మహానంది: శనివారం ఉదయం నుంచి వాతావరణం చల్లగా ఉంది. ఆకాశంలో మేఘాలు మబ్బులు కమ్మి వర్షించేందుకు వస్తున్నామంటూ ఊరించాయి. సాయంత్రం నాలుగు గంటలకే ఏడు గంటలైందా అన్నట్లు మబ్బులు ఆవరించాయి. ఎట్టకేలకు సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేశారు. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊరట చెందారు.

వర్షం.. హర్షం

కొత్తపల్లి: మండలంలోని కొక్కెరంచ, దుద్యాల, నందికుంట, కొత్తమాడుగుల, ఎదురుపాడు గ్రామాలలో ఆదివారం ఓ మోస్తరు వర్షం పడింది. ఎర్రమఠం, ముసలిమడుగు, గుమ్మడాపురం, శివపురం, లింగాపురం, గువ్వలకుంట్ల, వీరాపురం, గ్రామాలతో పాటు కొత్తపల్లి మండల కేంద్రంలో జల్లులు పడ్డాయి. ఈ వర్షం విత్తనాల సాగుకు అనుకులంగా ఉంటుందని రైతన్నలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఓ మోస్తరు వర్షం

మిడుతూరు: మండల కేంద్రమైన మిడుతూరుతోపాటు పీరుసాహెబ్‌పేట, కడుమూరు, నాగలూటి, పైపాలం, కలమందలపాడు, తదితర గ్రామాల్లో మధ్యహ్నం ఓ మోస్తారు వర్షం కురిసింది. జూన్ మాసంలో ఇప్పటివరకు వర్షం కురవక పోవడంతో రైతులు దిగాలు చెందారు. విత్తనాలు విత్తుకోవడానికి రైతన్నలు పొలాలు సిద్ధం చేసుకొని ఎదురు చూస్తున్న తరుణంలో వర్షం కురియడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షంతో బోరుబావుల కింద సాగుచేసిన పంటలకు జీవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వారపు సంత అస్తవ్యస్తం

పాములపాడు: మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించే వారపు సంత వర్షం వల్ల అస్తవ్యస్తంగా మారింది. సాయంత్రం వేళలో వినియోగదారులతో సంత కిటకిటలాడుతోంది. అయితే వర్షం కురవడంతో ప్రజలు పరుగులు తీశారు. కూరగాయల వ్యాపారుల పరిస్థితి దయనీయం. కూరగాయలు, సరుకుల పై పట్టలు కప్పి తడువకుండా చూసుకునేందుకు వారి పాట్లు అన్నీ ఇన్నీ కావు.